సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 13 । జనవరి । 2023



గంభీరావుపేటలో 2కే రన్

గంభీరావుపేట(సిరిసిల్ల): వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం గంభీరావుపేటలో విద్యార్థులు 2కే రన్ నిర్వహించారు.



అలిశెట్టికి నివాళి

సిరిసిల్లకల్చరల్: అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా రచయితల సంఘం నివాళి అర్పించింది. ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/13.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. తీవ్ర ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

పెరగని కూలి.. కడుపులు ఖాళీ

- సిరిసిల్లలో సైజింగ్ కార్మికుల దైన్యస్థితి
- 20 రోజులు దాటిన సమ్మె
- కూలి పెంచేందుకు యజమానులు ససేమిరా
- రోడ్డున పడిన వందలాది కార్మికులు



సమ్మె చేస్తున్న సిరిసిల్ల సైజింగ్ కార్మికులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న పులుగం మురళి 35 ఏళ్లుగా సిరిసిల్లలో సైజింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయగా.. కొడుకు శ్రీనివాస్ గార్మెంట్స్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. రాజీవ్‌నగర్‌లో గతంలో ప్రభుత్వం ఇచ్చిన 80 గజాల స్థలంలో గుడిసె వేసుకున్నాడు. పొద్దున 6 గంటలకు ఇంటి నుంచి వెళ్తే రాత్రి 8 గంటలకు తిరిగొస్తాడు. మధ్యాహ్న భోజనం చేయాలంటే మిషన్ ఆపకుండా తినాల్సిందే. ఇంత కష్టపడితే నెలకు వచ్చేది రూ.7,775 మాత్రమే. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇవి ఏ మూలకు సరిపోవు.

ప్రస్తుత కూలి.. పెంచాల్సిన కూలి(రూ.లలో)

కార్మికులు	ప్రస్తుతం	పెంచాల్సింది
సైజర్	7,850	15,171
బ్యాక్‌సైజర్	7,625	18,816
ఫైర్‌మెన్	7,625	14,691
కోల్‌మెన్	7,625	14,571
వార్పర్	7,700	14,931
హెల్పర్	7,050	14,216
రివైండర్	7,050	14,216



సమ్మెతో మూతబడిన సైజింగ్ యూనిట్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తి పరిశ్రమలో ప్రధాన పాత్ర పోషించే సైజింగ్ కార్మికులు బతుకులు భారంగా ఈడుస్తున్నారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తూ కుటుంబాన్ని భారంగా మోస్తున్నారు. నెల మొత్తం కష్టపడితే రూ.7వేలు మాత్రమే వస్తుండడంతో కూలి పెంచాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. ఇరువై రోజులుగా సమ్మె చేస్తున్నా యజమానులు, అధికారుల నుంచి స్పందన కరువైంది. కనీస వేతన చట్టం అమలు చేయాలని సైజింగ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సైజింగ్ కార్మికుల పని ఇలా..

ఉదయం 6 గంటలకల్లా.. సైజింగ్ యూనిట్‌కు చేరుకోవాలి. యారన్ సంచుల నుంచి కోములు తీసి పోగులను అల్లాలి. ఒక్కో కోములో దారం సుమారు 22 వేల మీటర్ల పొడవు ఉంటుంది. ఉదాహరణకు 3,000 పోగుల భీములు తయారు చేయాలంటే 600 కోములను తీసి భీముపై అల్లాల్సి ఉంటుంది. కోము నుంచి తీసే ఒక్కో పలుచని దారంపోగు తెగిపోకుండా కళ్లల్లో వత్తులు వేసుకొని పనిచేస్తుంటారు. సైజింగ్ మిషన్‌పై పనిచేసే కార్మికులు నీటిఆవిరి గంజిని దారానికి పట్టిస్తూ భీముపైకి పంపిస్తారు. ఈక్రమంలో వెలువడే ఉన్ని, రసాయనాలు కార్మికుల ఊపిరితిత్తుల్లోకి పోయి అనారోగ్యం పాలవుతున్నారు. నీటి ఆవిరి వచ్చే బాయిలర్ వద్ద పనిచేసే కార్మికులకు ఛాతికి భరించరాని మంట సెగలు తగులుతున్నా పనిచేస్తుంటారు. ఇంత కష్టపడుతున్నా చాలీచాలని వేతనాలే వస్తున్నాయి.

ఐదేళ్లుగా పెరగని కూలి

కాటన్ వస్త్రోత్పత్తిలో పనిచేసే అన్నిరంగాల కార్మికుల కూలీలను ప్రతి రెండేళ్లకోసారి పెంచుతారు. సైజింగ్ కార్మికుల కూలి మాత్రం 2019 నుంచి ఇప్పటి వరకు పెరగలేదు. సిరిసిల్ల సైజింగ్‌లో ప్రస్తుతం 70 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.7వేలు మాత్రమే వేతనంగా వస్తుంది.

కాటన్ వస్త్రానికి 'సమ్మె'ట పోటు

సైజింగ్ కార్మికుల కూలి పోరుతో సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తి రంగానికి 'సమ్మె'ట పోటు తగిలింది. పట్టణంలోని సుమారు వేయి సాంచాలపై కాటన్ వస్త్రం(కేస్మిట్) తయారి అవుతుంది. నేతకార్మికులు 2000, హమాలీలు 40, వైపని కార్మికులు 40, డైయింగ్ కార్మికులు 150 మంది ఉన్నారు. సిరిసిల్లలో తయారయ్యే కేస్మిట్ క్లాత్‌తో మహిళలు ధరించే పెట్టికోట్స్(లోలంగాలు) తయారవుతాయి. వీటి ద్వారా స్థానికంగా ఉండే మహిళ కార్మికులు సుమారు 4000 మంది లంగాలు కుడుతూ ఉపాధి పొందుతున్నారు.

పనిలేకుంటే..జీతం కట్



నాకు వచ్చే రూ.7,775తో భార్య, ఇద్దరు పిల్లలం బతుకుతున్నం. పిల్లలను సర్కారు బడిలో చదివిస్తున్న. అద్దె ఇంట్లో ఉంటున్న మాకు ఈ జీతం ఎటూ సరిపోతలేదు. అధికారులు ఆలోచించాలి. నెలవారీ జీతాలు ఇవ్వకుండా పని లేని రోజుకు జీతాన్ని కట్ చేస్తున్నారు. కార్మికులకు పనికి సమాన వేతనాలు ఇప్పించాలి.

– ఎలిగేటి రాము, వార్పర్

రెండేళ్లుగా వాయిదా



కార్మికుల కూలీలు పెంచకుండా యజమానులు రెండేళ్లుగా వాయిదా వేస్తున్నారు. 2021లో కూలి పెంచాలని కోరితే కరోనా అన్నారు. 2022లో అడుగగా.. ఆరు నెలల గడువుతో రెండుసార్లు పొడగించారు. ఇప్పుడు పెంచలేమని జిల్లా లేబర్ అధికారి సమక్షంలోనే నిర్లక్ష్యంగా చెబుతున్నారు.

– వొల్లాల కిశోర్, సైజింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు

- లోవోల్టేజీ లేకుండా చూస్తాం
- స్టోర్స్ గోదాములను నిర్మిస్తాం
- బకాయిల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక
- విలేజీ ప్రతినిధులను నియమిస్తాం
- 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు



'సెస్' సేవలు విస్తరిస్తాం

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) పరిధిలో సేవలను మండల కేంద్రాలకు విస్తరిస్తామని, వినియోగదారులకు పారదర్శకంగా, నిజాయితీగా, అవినీతి రహితంగా సేవలందిస్తామని 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో విద్యుత్ పంపిణీ సంస్థ 'సెస్' చైర్మన్‌గా ఎన్నికైన చిక్కాల రామారావు పాలన సంస్కరణలకు శ్రీకారం చుడుతామన్నారు. లోవోల్టేజీ సమస్యలు పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని వివరించారు. 'సెస్' చైర్మన్‌గా మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆయన గురువారం 'సెస్' ఆఫీస్‌లో 'సాక్షి'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

లోవోల్టేజీ సమస్య పరిష్కరిస్తాం

జిల్లా స్థాయిలో విద్యుత్ పంపిణీలో లోవోల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి లోడ్ ఫ్యాక్ట్ ఆధారంగా సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే కొన్ని సబ్‌స్టేషన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కొత్త సబ్‌స్టేషన్ల అవసరాన్ని బట్టి ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతంలోనైన లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

'సెస్' స్టోర్స్‌ను నిర్మిస్తాం

స్టోర్స్ కోసం ప్రభుత్వం టెక్స్‌టైల్‌పార్క్ సమీపంలో ఐదెకరాలు కేటాయించింది. ఆ స్థలం హద్దులు నిర్ధారణ చేయించి తొలుత ప్రహరీని నిర్మించి స్టోర్స్ కోసం గోదాములు, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. గతంలోని స్టోర్స్ స్థలంలో రైతు బజారు నిర్మించారు. ఇప్పుడు కొత్తగా కేటాయించిన స్థలంలో శాశ్వత స్టోర్స్ నిర్మిస్తాం.

విలేజీ ప్రతినిధులను ఎంపిక చేస్తాం

బైలా ప్రకారం 'సెస్' సంస్థకు ప్రతి గ్రామం నుంచి విలేజీ ప్రతినిధులు ఉంటారు. కొత్త కార్యవర్గం ఎన్నికవడంతో విలేజీ ప్రతినిధులను నియమించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ విలేజీ ప్రతినిధుల ఎంపికను ఫిబ్రవరిలో పూర్తిచేస్తాం. ఈ ప్రక్రియ పూర్తయితే 'సెస్' మహాసభను నిబంధనల మేరకు నిర్వహించాల్సి ఉంటుంది.

విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక

'సెస్' పరిధిలో విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రభుత్వపరంగా రావాల్సిన బకాయిలు విడుదలయ్యేలా చూస్తాం. బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రతి నెలా కనీసం రూ.20 కోట్లు వసూలు అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తాం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 'సెస్'కు పూర్వవైభవం తెచ్చేలా పనిచేస్తాం.

23న తొలి సమావేశం

'సెస్' పాలకవర్గం తొలి సమావేశం జనవరి 23న నిర్వహిస్తున్నాం. పాలకవర్గం సమావేశంలో అన్ని విషయాలు చర్చించి, చర్యలు తీసుకుంటాం. ప్రజలు మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సత్వర సేవలు అందిస్తాం.

సేవలను విస్తరిస్తాం

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 'సెస్' సేవా సదన్‌లను ఏర్పాటు చేస్తాం. కొత్త మండలాల్లో సేవా సదన్ భవనాలు లేవు. కొన్ని మండలాల్లో ఉన్నా శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ సహకారంతో కొత్త మండలాల్లో స్థలాలను సేకరించి, సేవా సదన్‌లను ఏర్పాటు చేస్తాం. సెస్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు మా పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుంది.

అలరించిన త్యాగరాజ ఉత్సవాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు గురువారం రెండో రోజుకు చేరాయి. శిఖమునిచే పార్వతీ కల్యాణం హరికథ గానం, వయోలిన్ శ్రీనివాస్, మృదంగం రాజేశ్, హార్మోనియం ఉదయ్‌కుమార్, తబలా రమేశ్, హరికథ నారాయణదాసు, సంగీత కచేరి సుధీర్, శాస్త్రీయ సంగీత కచేరి మల్లాది సూరిబాబు, సితార సోలో సంగీత కచేరి పాండురంగారావు ప్రదర్శించారు.



న్యూస్‌రీల్

బద్దిపోచమ్మ గుడి విస్తరణ పనులు పరిశీలన



వేములవాడ: వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను దేవాదాయశాఖ స్థపతి వల్లి నాయగం, ఎస్ఈ మల్లికార్జున్ రెడ్డి, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులను ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ వివరించారు. ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకులు హరిహరనాథ్ ఉన్నారు.

వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

సిరిసిల్లఅర్బన్: వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా యువజన క్రీడ అధికారి ఉపేందర్‌రావు పేర్కొన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యతోనే చైతన్యం సాధ్యమని చాటిచెప్పిన మహాయోగి వివేకానంద అన్నారు. వెంకంపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, పెటా ప్రధాన కార్యదర్శి సాన బాబు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుబీమాతో భరోసా



బోయినపల్లి(చొప్పదండి): రైతుబీమా అన్నదాతల కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. దేశాయిపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాలకు చెందిన కొంకటి లక్ష్మణ్, మరాఠి లక్ష్మి, ఆర్సం నర్సయ్యల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ప్రొసీడింగ్స్ అందజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ఎం.సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పి.వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ నాగయ్య, సెస్ డైరెక్టర్ సుధాకర్, సర్పంచులు రాజగోపాల్‌రెడ్డి, నందయ్య ఉన్నారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి



గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు వరమని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యతో కలిసి 96 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణరావు, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలు తెలియాలి



సిరిసిల్లటౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. బాలలకు రాజ్యాంగం ప్రత్యేకంగా హక్కులు కల్పించిందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. న్యాయసేవా సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, హెచ్‌ఎం భాగ్యరేఖ, న్యాయవాది వేణు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి



మనోజ్(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మర్లపేటకు చెందిన పర్లపల్లి మనోజ్(19) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన మనోజ్ గ్రామంలోని స్కూల్ సమీపంలోని కందకంలో శవమై కనిపించాడు. మనోజ్ తల్లిదండ్రులు పర్లపల్లి పద్మ, అంజయ్య. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సదరం'పై చేతులెత్తేసిన ఏసీబీ..!

- సివిల్ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్
- గతేడాది సుమోటోగా స్వీకరించిన ఏసీబీ
- ప్రశ్నావళికే పరిమితమైన అధికారులు
- అనుమానితులపై తూతూమంత్రపు విచారణ
- చివరికి ఏసీబీ విచారణను సైతం అడ్డుకున్న నిందితులు?

'317 జీవో అమలు సందర్భంగా వరంగల్ జిల్లాలో బదిలీని తప్పించుకునేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అప్పగించిన దాదాపు 40కిపైగా నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లను గుర్తించారు. అందులో 10కిపైగా సర్టిఫికెట్లు కరీంనగర్ సివిల్ ఆసుపత్రి నుంచి జారీ అయినవే. అదే సమయంలో కరీంనగర్‌లోనూ పలు అనుమానాస్పద సర్టిఫికెట్లపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో వాటిని పక్కనపెట్టాలని స్వయంగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ అనుమానాస్పద సర్టిఫికెట్లు సైతం కరీంనగర్ సివిల్ ఆసుపత్రి ఇచ్చినవే కావడం గమనార్హం'.



కరీంనగర్ సివిల్ ఆసుపత్రి



Government of Telangana
CERTIFICATE FOR PERSON WITH DISABILITY

సూపరింటెండెంట్ రత్నమాల జారీ చేసిన 100 శాతం వైకల్యం సర్టిఫికెట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ సివిల్ ఆసుపత్రి కేంద్రంగా 'సాక్షి' బయటపెట్టిన అనర్హులకు సదరం సర్టిఫికెట్ల స్కామ్ వ్యవహారం ఎంత వేగంగా బయటికి వచ్చిందో.. ఇప్పుడు అంతేవేగంగా మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 6న 'దివ్యంగా దోచేస్తున్నారు' శీర్షికన సివిల్ ఆస్పత్రిలో కొందరు వైద్యసిబ్బంది, తాత్కాలిక సిబ్బందితో కుమ్మక్కై అనర్హులకు దివ్యాంగ సర్టిఫికెట్లు కట్టబెడుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ తరువాత వరుస కథనాలు వచ్చాయి. దీనికి తమకు సంబంధం లేదని చెప్పిన సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నమాల.. సదరు ఆరోపణలు వచ్చిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు శ్రీనివాస్, కిశోర్‌ను బాధ్యులుగా చేస్తూ విధుల నుంచి తప్పించారు. అప్పటికే డీఆర్‌డీఏ వీరిని తొలగించి రెండేళ్ల గడిచినా.. వీరు జీతం లేకుండా.. అనర్హులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తూ స్వేచ్ఛగా దందా కొనసాగించారు. అసలు ఏ వైకల్యంలేని వారికి సైతం 100 శాతం వైకల్యం జారీ చేసిన విధానం చూసి సివిల్ ఆస్పత్రి సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లను గతేడాది 'సాక్షి' ప్రచురించినా.. ఇప్పటికీ సదరం వెబ్‌సైట్‌లో అలాగే ఉంచడం గమనార్హం.

విచారణలన్నీ తుంగలోకే..!

'సాక్షి' కథనాలతో జిల్లా యంత్రాంగం తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి అడిషనల్ డీఆర్‌డీవో నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. వాస్తవానికి 2015 నుంచి ఉమ్మడి జిల్లా ఉన్నప్పటి నుంచి నకిలీ సర్టిఫికెట్ల దందా నడుస్తోందని ఆరోపణలు ఉన్నా.. కేవలం 2021 జనవరి నుంచి 2022 జనవరి వరకు జారీ అయిన సర్టిఫికెట్లపై మాత్రమే విచారణ జరిగింది. 16 మండలాల్లోనూ విచారణ జరిపిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపారు. కానీ, ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులు చక్రం తిప్పి దాన్ని వెలుగులోకి రానీయలేదు. అధికారుల తీరుపై విమర్శలు రావడంతో మరోసారి మార్కెటింగ్ శాఖలోని ఓ ముఖ్య అధికారితో విచారణ చేయించారు. తర్వాత మరో అధికారి కూడా ఇదే అంశంపై విచారించారు. ఈ ఇద్దరూ ఏం విచారణ చేశారో? ఏం నివేదిక ఇచ్చారో? ఎవరికీ తెలియదు. అంతకు ముందు టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేశారు. సదరు సర్టిఫికెట్లపై సివిల్ ఆసుపత్రి కూడా విచారణకు ఓ వైద్యుడిని నియమించింది. ఎన్ని విచారణలు వేసినా ఇంతవరకూ వాస్తవాలు వెలుగు చూడలేదు.

ఏసీబీ ప్రవేశంతో మారిన సీన్ !

ఈ కేసులో సూత్రధారులకు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయి. దీంతో జిల్లా అధికారుల విచారణ నివేదికలను బయటికిరాకుండా తొక్కిపెట్టారు. కానీ.. ఏసీబీ సుమోటోగా కేసు స్వీకరించే సరికి అందరికీ చెమటలు పట్టాయి. ఏసీబీ విచారణ ప్రారంభించాక ఇటు డీఆర్‌డీవో, అటు సివిల్ ఆసుపత్రిలోని కిందిస్థాయి సిబ్బందిని పిలిపించి విచారించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నల జాబితా పంపించి సమాధానాలు సేకరించారు. ఆ తర్వాత విచారణ ఊపందుకుంటుందని అంతా అనుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా పరిగణించి విచారణకు చేపట్టిన ఏసీబీ అధికారులు తొలుత దర్యాప్తును పరుగులు పెట్టించినా.. ఇప్పుడు ఎటూ కాకుండా స్తంభించిపోయింది. దీని వెనక కొందరి ఒత్తిళ్లే కారణమని గుసగుసలు వస్తున్నాయి. మొత్తానికి అవినీతిపై వేసిన విచారణను పూర్తి చేయడంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) విఫలమైందన్న విమర్శలను మాత్రం మూటగట్టుకుంటోంది.

ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం..!

సదరం సర్టిఫికెట్ల జారీ వెనక రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. వీటిని వ్యాపారులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఇలా పలువురు అనేక రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి జాబితాలో సామాన్యులు కూడా ఉన్నారు. ఏ వైకల్యం లేకపోయినా.. చెవిటి, అంధ సర్టిఫికెట్లు తీసుకుని ప్రతినెలా ఠంచనుగా ఖాతాలో రూ.3,000 చొప్పున వికలాంగ పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి జాబితాలో స్థానిక ప్రజాప్రతినిధుల బంధువులు అధికంగా ఉండటం గమనార్హం. పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు ఇన్‌కం ట్యాక్స్, బదిలీల్లో మినహాయింపు కోసం వీటిని వాడుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన నెలనెలా రూ.కోట్ల నష్టం ఖజానాకు చిల్లులు పడుతోంది. ఈ వ్యవహారంలో కనీసం ఏసీబీతోనైనా న్యాయం జరుగుతుందని భావించినా చివరికి నిరాశే మిగిలిందని సాక్షాత్తూ సివిల్ ఆసుపత్రి సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు.

'కంటి వెలుగు'కు 26 బృందాలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో 'కంటి వెలుగు'లో పరీక్షలు నిర్వహించేందుకు 26 బృందాలను సిద్ధం చేశామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రిజ్వీ, కమిషనర్ శ్వేతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో రెండోవిడత కంటివెలుగు నిర్వహణకు 26 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 26 మంది ఆప్తాల్మిక్ టెక్నీషియన్లను, 26 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను భర్తీ చేశామన్నారు. 19 ఆటో రిఫ్రాక్టివ్ మిషన్లు వచ్చాయని, ఇతర సామగ్రి వచ్చినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో జనవరి 18 నుంచి రెండోవిడత 'కంటి వెలుగు'ను ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేపడతామని వివరించారు. జిల్లాలో 'కంటి వెలుగు' విజయవంతం చేస్తామని వివరించారు. రేషన్‌షాపుల వద్ద, పబ్లిక్ ప్రదేశాల్లో కంటివెలుగుపై ప్రచారం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించేలా, జిల్లాస్థాయిలో జిల్లా వైద్యాధికారి, ఇతర అధికారులు పర్యవేక్షించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, డీపీవో రవీందర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డీడీఎం కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలని వైద్యాధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వైద్యాధికారులతో సమీక్షించారు. సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. క్షయ రోగులను గుర్తించేదుకు క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు అందించే రూ.500 వారి ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో నిర్మిస్తున్న వంద పడకల నిర్మాణ పనులు, వైద్య కళాశాల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారులు రజిత, శ్రీరాములు, మహేశ్ ఉన్నారు.

బీమాతో కుటుంబానికి భరోసా

- రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్

వేములవాడఅర్బన్: బీమా ద్వారా కుటుంబానికి భరోసా ఉంటుందని రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. వేములవాడ యూనియన్ బ్యాంకు ఖాతాదారులుగా ఉన్న లత అకస్మాత్తుగా మృతిచెందడంతో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా రూ.2లక్షల చెక్కును మృతురాలి భర్త రాజిరెడ్డికి గురువారం అందజేశారు. బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు వినియోగదారులకు డిజిటల్ బ్యాంకు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బ్యాంకు సబ్‌మేనేజర్ అనురాధ, డిప్యూటీ మేనేజర్ నవీన్ ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలకు తరలిరండి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈ నెల 13, 14వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) 5వ రాష్ట్ర మహాసభలను రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహిస్తున్నామని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీచర్ల మహా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

కోనరావుపేట(వేములవాడ): వీర్నపల్లి మండలం గర్జనపల్లి నుంచి కోనరావుపేట మండలం వట్టిమల్లలో గురువారం పనులకు వెళ్తున్న కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడింది. ఈ సంఘటనలో 8 మంది గాయపడ్డారు. మహారాష్ట్రకు చెందిన గణేశ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లాకు చెందిన రాజు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మాట్ల అశోక్ ప్రతిమ అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.







విద్యార్థుల ఇంటిబాట

విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు గురువారం మధ్యాహ్నం నుంచే ఇంటిబాట పట్టారు. చిన్నారులను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులతో సిరిసిల్లలోని బస్టాండ్ రద్దీగా మారింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

యూరియా కొరత.. రైతన్న వెత

- పంటలకు కీలక సమయంలో అందని రసాయన ఎరువు
- దిగుబడిపై ప్రభావం పడుతుందని అన్నదాతల ఆందోళన
- ఫర్టిలైజర్ దుకాణాల వద్దకు పరుగులు
- జిల్లాకు 19 వేల టన్నులు అవసరం



“ఈ రైతు పేరు ఒద్యారపు రమేశ్. రుద్రంగికి చెందిన ఈయన మూడెకరాల్లో వరి సాగు చేశాడు. నాటు వేసి, నెల రోజులవుతోంది. సొసైటీ తరపున యూరియా తెప్పించకపోవడంతో వారం రోజులుగా ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నాడు. సమయం మించిపోతోందని, తర్వాత చల్లినా ఏం ప్రయోజనం ఉండదని ఆందోళన చెందుతున్నాడు. యూరియా కొరత తీర్చాలని కోరుతున్నాడు.



ఈ రైతు పేరు గోనె లక్ష్మణ్ రావు. రుద్రంగికి చెందిన ఈయన ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. 15 బస్తాల యూరియా అవసరం కాగా ఎప్పుడు వస్తుందా అని వారం రోజులుగా ఎదురుచూస్తున్నాడు. ఇది ఈ ఇద్దరు అన్నదాతల పరిస్థితే కాదు.. రాజన్నసిరిసిల్ల జిల్లాలో పంటలు సాగు చేసిన వేలాది మందిది. సమయానికి యూరియా వేయకపోతే పంట ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు.”



బుధవారం ఓ ప్రైవేటు షాపు వద్దకు లారీలో యూరియా రావడంతో తరలివచ్చిన అన్నదాతలు

రుద్రంగి(వేములవాడ): రైతన్నలకు పంటల సాగులో ఆటుపోట్లు తప్పడం లేదు. వానాకాలం సీజన్‌లో మొగి పురుగు సోకి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతో పెట్టుబడులు కూడా మిగలలేదు. యాసంగిలోనైనా మంచి దిగుబడులు సాధించాలని అన్నదాతలు ముందుగానే పంటలు సాగు చేశారు. తీరా సమయానికి యూరియా కొరత వేధిస్తుండటంతో ఆశించిన దిగుబడి రాదేమోనని దిగులు చెందుతున్నారు. అధికారులు స్పందించి, త్వరగా యూరియా అందుబాటులోకి తీసుకువచ్చి, తమకు నష్టం వాటిల్లకుండా చూడాలని వేడుకుంటున్నారు.

లక్ష ఎకరాల్లో పంటలు..

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 1,00,721 ఎకరాల్లో వరి, 32.65 ఎకరాల్లో పెసర, 331.49 ఎకరాల్లో శనగ, 451.35 ఎకరాల్లో మొక్కజొన్న, 64.4 ఎకరాల్లో పల్లి, 127.79 ఎకరాల్లో సన్ ఫ్లవర్, 42 ఎకరాల్లో నువ్వులు, 35 ఎకరాల్లో ఆవాలు, 30.3 ఎకరాల్లో ఇతర పంటలు మొత్తం 1,01,835.98 ఎకరాల్లో పంటల సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం ఈ పంటలకు 19 వేల టన్నుల యూరియా అవసరం అవుతుంది.

సకాలంలో సరఫరా చేయని సొసైటీ

యూరియా కావాలని 15 రోజులుగా రైతులు సనుగుల సొసైటీ పాలకవర్గాన్ని కోరుతున్నారు. వారు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఈ సొసైటీ పరిధిలోని రుద్రంగికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్న పాలకవర్గం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రుద్రంగి ప్రాంతానికి చెందిన రైతులు ఎరువులు తీసుకునే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాతలు

సొసైటీలో యూరియా లేకపోవడంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేస్తూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒక యూరియా బస్తాకు సుమారు రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా చెల్లిస్తున్నారు. పెరిగిన ధరలతో ఇప్పటికే పెట్టుబడులు అధికమై, ఆదాయం వచ్చే పరిస్థితి లేదని, పంటలు సాగు చేసి అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇండెంట్ పంపించాం



ముందులా కాకుండా ఇప్పుడు మండల వ్యవసాయ అధికారికి ఇండెంట్ ఇవ్వాలన్నారు. సనుగుల సొసైటీకి యూరియా రావడంలో ఆలస్యమైంది. ఇండెంట్ పంపించాం.

– శ్రీవర్ధన్, సీఈవో, సనుగుల సొసైటీ

యూరియా త్వరలో వస్తుంది



సనుగుల సొసైటీ నిర్వాహకులు ఈరోజే ఇండెంట్ ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. యూరియా త్వరలోనే రైతులకు అందుబాటులోకి వస్తుంది.

– వెంకటరావమ్మ, ఇన్‌చార్జి ఏవో, రుద్రంగి

విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: నూతన అవిష్కరణలు చేసి, జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్, జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థినులను కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం అభినందించారు. వారు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎంచుకున్న అంశాలు దైనందిన జీవితంలో ఎంతో ఉపయోగకరమైనవని పేర్కొన్నారు. డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి మూడు ఎగ్జిబిట్స్ జాతీయ స్థాయికి, రెండు ఎగ్జిబిట్స్ సౌత్ ఇండియా స్థాయికి ఎంపికవడం అభినందనీయమన్నారు. మరింత నైపుణ్యం ప్రదర్శించి, జాతీయస్థాయిలో నూసత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, నారాయణ, గైడ్ టీచర్లు మహేశ్ చంద్ర, దోర్నాల భూపాల్ రెడ్డి, కిషన్, నవీన్, విద్యార్థినులు శ్రీ సమర్థ, వినీల, జంకే శ్రీనిధి, పండుగ సహస్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయండి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



సారయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలను వారి దరి చేరేలా కార్యకర్తలు పనిచేయాలని, ఈక్రమంలోనే పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీటీసీ ఆఫీస్‌లో గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈసందర్భంగా సారయ్య మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. రజకుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు బాలమల్లు, నర్సింహులు, రమేశ్‌గౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

‘కంటివెలుగు’కు పారితోషికం ఇవ్వాలి

- డీఎంహెచ్‌వోకు వినతి



డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ‘కంటివెలుగు’ కార్యక్రమానికి ఆశావర్కర్లకు అదనపు పారితోషికం ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జనవరి 18 నుంచి వరుసగా వంద రోజులు కొనసాగుతుండడంతో పనిభారం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం ఆశావర్కర్ల సంక్షేమం కోసం అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, మోర అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సిబ్బంది ధర్నా



ధర్నా చేస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో పెరిగిన పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం ముందు గురువారం ధర్నా చేపట్టారు. గతంలో సమస్యలు వివరిస్తూ.. జాయింట్ కలెక్టర్‌కు విన్నవించి నెలరోజులు గడుస్తుందన్నారు. హామీలను వెంటనే నెరవేర్చే వరకు నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆస్పత్రి సిబ్బంది శ్రీరాం సదానందం, నాగమణి, రేవతి, తిరుపతి, దేవరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు
- నర్మాలలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



గంభీరావుపేట(సిరిసిల్ల): చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. గంభీరావుపేట మండలం నర్మాలలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యతో కలిసి గురువారం ఆవిష్కరించారు.

కేజీ టు పీజీ ప్రాంగణం దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో మొట్టమొదటగా గంభీరావుపేటలో నిర్మించిన కేజీ టు జీ ప్రాంగణం దేశానికే ఆదర్శమని టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు పేర్కొన్నారు. కేజీ టు పీజీకి సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో నర్మాల సర్పంచ్ ఎడబోయిన రాజు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, వైస్ ఎంపీపీ లత, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, ప్రిన్సిపాల్స్ పిట్ల దాసు, వెంకట్‌నాయక్, హెచ్‌ఎంలు గంగారాం, బాల ఎల్లయ్య, లింగారెడ్డి, ఎంపీటీసీ భాగ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటివెలుగు కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ సూచించారు. తంగళ్లపల్లిలోని ఎమ్మార్సీలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లచ్చాలు, తంగళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ స్నేహ, వైద్యసిబ్బంది రాజేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అదనుచూసి హతమార్చింది

- నిత్యం తాగుడు.. వేధింపులు తాళలేక..
- భర్తను హత్య చేసిన భార్య
- గడ్డపారతో పొడిచి దారుణం
- లంబాడితండాలో విషాదం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- బాలరక్ష భవన్‌కు పిల్లల తరలింపు



వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడ్డి



తండ్రిని కోల్పోయిన చిన్నారులు



తేజనాయక్ మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): భర్త తాగుడుకు బానిసై నిత్యం వేధించడంతో తట్టుకోలేని భార్య అతడిని హతమార్చింది. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లండాడితండా గ్రామానికి చెందిన గుగులోతు తేజనాయక్(32)ను గురువారం ఉదయం భార్య గుగులోతు కవిత గడ్డపారతో కొట్టి హత్యచేసింది. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన కవితకు లండాడితండాకు చెందిన గుగులోతు తేజనాయక్‌తో 2010లో వివాహమైంది. కూలీ పనులు చేసుకునే తేజనాయక్ తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి భార్యతో గొడవపడటంతో పాటు వేధించేవాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం తేజనాయక్ తాగి ఇంటి ముందున్న చింతచెట్టు కింద పడుకున్నాడు. దీంతో అదనుచూసిన కవిత ఇంట్లోని గడ్డపారతో తేజనాయక్ ఎడమవైపు మెడపై పొడిచి, విచక్షణ రహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అతడి తల్లితండ్రులు ఇటీవలే మృతిచెందారు.

నాన్నను నిద్ర లేపేలోపు అమ్మ చంపింది

‘తాగి చెట్టుకింద పడుకున్న నాన్నను లేపుదామని వెళ్లేసరికి లేవలేదు. అమ్మ వచ్చి గడ్డపారతో కొట్టి చంపింది’ అని మృతుడి కుమారుడు గుగులోతు మహేశ్(9), కూతురు మహదేవి(8), చిన్న కుమారుడు గిరేందర్(5) ఘటన స్థలంలో చెప్పినతీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. ‘నాన్నను కొట్టిన తర్వాత అమ్మ ఇంట్లోనుంచి పారిపోయింది. మేము ఊరి బడిలో చదువుకుంటున్నాం. రోజూ ఇంట్లో లొల్లి జరుగుతుంది’ అని చిన్నారులు పేర్కొన్నారు.

పిల్లలను చూసి చలించిపోయిన సీఐ

లండాడితండాలో గుగులోతు తేజనాయక్ హత్య స్థలాన్ని సందర్శించిన సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి మృతుడి పిల్లలను చూసి చలించిపోయారు. వారికి బిస్కెట్లు తినిపించారు. వారికి నీళ్లు తాగించి జరిగిన ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు పిల్లలు

హత్యకు గురైన తేజనాయక్ పిల్లలు మహేశ్, మహదేవి, గిరేందర్‌లను పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు తరలించాలని తండావాసులు సీఐ, ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. తేజనాయక్ అంత్యక్రియలు జరిగిన పిమ్మట తీసుకెళ్లాలని బాలరక్ష భవన్ కోఆర్డినేటర్‌కు సీఐ ఆదేశాలు జారీ చేశారు.

స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు

భర్త గుగులోతు తేజనాయక్‌ను హత్యచేసిన కవిత నేరుగా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. కవితపై హత్యకేసు నమోదు చేసి సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన డీసీసీ అధ్యక్షుడు




మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డిలతో ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: పీసీసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన హాత్ సే హాత్ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ఆయన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేలను కలిశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

స్థానిక మిల్లర్లే పత్తి కొనుగోలు చేయాలి

- వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు



మాట్లాడుతున్న చైర్మన్ ప్రభాకర్‌రావు

వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్ పరిధిలో ఉన్న మిల్లర్లే పత్తి కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం మార్కెట్ కమిటీ పాలకవర్గం, మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతం నుంచి కొంతమంది దళారులు పత్తి కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులకు నష్టంతో పాటు మార్కెట్ వచ్చే ఆదాయం కూడా తగ్గుతుందన్నారు. బయట పత్తి కొనుగోలు చేసే దళారులు మార్కెట్ ఫీజు చెల్లించకుండా దొంగచాటున లారీల్లో తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇకముందు ఇలా జరిగితే మార్కెట్ సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కమిటీ వైస్ చైర్మన్ వెలమ బాల్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, వ్యాపారులున్నారు.

సమావేశంలో ఆంతర్యమేమిటో?

వేములవాడ మార్కెట్ పరిధిలోని మిల్లర్లతో అత్యవసర సమావేశంలో ఆంతర్యమేమిటో అని పలువురు చర్చించుకుంటున్నారు. మార్కెట్ కమిటీ మొత్తం పాలకవర్గానికి సమాచారం లేకుండానే చైర్మన్, కొంతమంది సభ్యులు మిల్లర్లను పిలిపించుకొని, హడావుడిగా సమావేశం నిర్వహించారని అంటున్నారు.